# భిన్నతత్వ పరతంత్రులు X

రచన:
శ్రీ కె: హన్మా.

చెల్లెలు రాజమ్మ వేసిన ప్రశ్న వినగానే అప్పలరాజుకు మతి చలించినట్లయింది. 'ఈ విషయం రాజమ్మకెలా తెలిసివుంటుంటి?' అని నివ్వెరబోయాడు. ఆలోచన కింకా అవకాశం లభించడానికని.

'మళ్ళీ చెప్పు ఆ సమస్యేమిటో?' అనడిగేడు చెల్లెల్ని.

'ఒక మగవాడు-సమ్ ఎక్స్ తన భార్యకు తెలియకుండా యింకొక స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఆ విషయం తెలుసుకున్న అతని భార్య నాకు స్నేహితురాలు శ్రేయోభిలాషి' నేనేం చెయ్యాలి? అని వివరించిందామె.

'అతని భార్య నాకు స్నేహితురాలు, శ్రేయోభిలాషి' అన్న ఆఖరి వాక్యం మొదటిసారి ప్రశ్న వేసినప్పుడు చెప్పలేదు. గనుక ముందు కంగారుపడ్డాడు, కాని తన విషయంకాదని యిప్పుడనిపించింది అప్పలరాజుకు. తనకు ఆఫీసులో రిసెప్షనిస్టు విమలతోవున్న సంబంధం కొంపదీసి తన చెల్లెలి చెవిలో పడిందేమోనన్నదే కంగారుకు కారణం. అయినా అనుమానం తీర్చుకునేందుకు మళ్ళీ వివరంగా అడిగేడు.

'అతని భార్య నీకు ఫ్రెండా. లేక అతన్నిగూడా నువ్వు యెరుగుదువా? అనడిగేడు.

'లేదు ... లేదు ... ఆమే నా క్లాస్ మేట్ ... పేరు చెప్పను. కాని నాకు సలహా యియ్యి. నాకేం తోచటం లేదు. ఏంచేసేదో చెప్పన్నయ్యా' అంది రాజమ్మ ప్రాధేయపడుతున్నట్లు.

'సలహా చెప్తానుగాని, అసలేం జరిగిందో వివరంగా చెప్పమ్మా అప్పుడు నాకు తోచింది చెప్తాను' అన్నాడు అప్పలరాజు లాయరులా...కాదు...కాదు ప్రయివేట్ డిటెక్టివ్‌లా.

'కథానాయకుడికి పెళ్ళయి సుమారు సంవత్సరం కావస్తోంది. కథానాయకి చదువుకున్నదీ, అందమైనదీ, అడిగినంత కట్నం యిచ్చి (ఒక ధనికుడి ఏకైక పుత్రిక గనుక) కావాలని కోరి, ప్రేమించి, ప్రేమించబడి అతన్ని పెళ్ళాడింది.

సుఖంగా సాగిపోతున్న యీ కథలో యిటీవలే వొక 'వ్యాంప్' (Vamp) ప్రవేశించిందట....'

''అట' అంటున్నావు. కథ మళ్ళీ కట్టుకథయిపోతోందేమిటి?' అన్నాడు అర్ధోక్తిలో అప్పలరాజు.

'అటే మరి...విను. నాకీవేళ కాలేజీలో ఒకమ్మాయి —అమ్మాయేంటి—అమ్మగారే—కనిపించింది. ఆమె నాకూ, కథానాయకికి స్నేహితురాలు. స్కూల్లో సీనియర్. ఆమె భర్తగారి ఆఫీసులో పనిచేసే టెలిఫోన్ గర్ల్‌తో మన కథానాయకుడు రోజూ కాలక్షేపం చేస్తున్నాడట. ఆ విషయం వాళ్ళాయన ఆవిడగారికి చెప్తే ఆమె నాతో చెప్పింది....'

'కథానాయకుడుగూడా ఆ ఆఫీసులోనేనా పనిచేస్తున్నాడు?' అప్పలరాజు ప్రశ్న?

'కాదు...ఆ ఆఫీసుకు యెదురుగుండా మరో ఆఫీసు. సాయంత్రం అయిదింటికి ఆఫీసుపని ముగించి ఆ యిద్దరూ ప్రణయకలాపం ప్రారంభిస్తారు. మొదట్లో రహస్యంగా సాగేదీ వ్యవహారమంతా. రానురాను పార్కుల్లోనూ, సినిమాల్లోనూ, లాడ్జింగ్‌లలోనూ అలా, అలా ముదురుతోంది. అయితే యీ ప్రణయగాథ పూర్తి క్లయిమాక్స్‌కు రాకముందే కట్ చెయ్యాలని నా ప్లాను. ఏం చెయ్యమంటావో చెప్పు' అని ముగించింది రాజమ్మ ప్రాసిక్యూషన్ లాయరు ప్రారంభోపన్యాసంలా.

'ఈ విషయమింకా నీ స్నేహితురాలి చెవిని పడలేదు కదూ నువ్వు వెళ్ళి ఆమెతో చెప్పాలని అనుకుంటున్నావు-సరే. ఈ విషయం తెలుసుకుని ఆమె చెయ్యగలిగేదేమిటి? తన భర్తను వారించగలదా? ఆమె వారించినంతలో 'చిత్తం' అని చేతులు నలుపుకుని వూరుకుంటాడా అతను? అలా అతను యీ డూప్లిసిటీ నాటకానికి 'సమాప్తం' అనకపోతే ఆమె అతనిదగ్గర విడాకులు కోరగలదా? ఈ విషయమామెకు తెలియనంతరకూ సాఫీగా నడుస్తున్న వాళ్ల సంసారంలో యీ సంగతి తెలియగానే చిచ్చుపుడుతుంది. అన్నానని కోప్పడకు. ఆడదానికుండే అవలక్షణాలన్నిట్లోకీ ఈర్ష్యకు ప్రథమస్థానమివ్వాలి. అందుచేత పరిస్థితులెలా పరిణమిస్తాయో? ఆ పరిస్థితులాయింట్లో కలుగ

జేసి వాళ్ళకు మనశ్శాంతిలేకుండా చెయ్యడమన్నది నీ చేతులమీదుగా యెందుకు జరగాలి?'

'అయితే వూరుకోమంటావా?' ఆతృతగా ప్రశ్నించింది రాజమ్మ.

'అవును. ఎప్పుడో తెలిసినప్పుడే తెలుస్తుంది. నువ్వెందుకు కలుగజేసుకోవాలి?'

'ఈలోగా వాళ్లే కలకత్తాయో, కాశ్మీరో వుడాయిస్తారు. అప్పుడీమెగతి?'

ఈ ప్రశ్నతో అప్పలరాజు అవాక్కయ్యాడు. అప్పడాల కర్రలా బిగుసుపోయి అలాగే వుండిపోయాడు—రేపు తనకూ యీసమస్య రావచ్చునేమో అనుకుంటూ.

'అందుచేత ఆమెకీవిషయం తెలియజెయ్యడం నా విధి. నాకు తెలీనన్నాళ్లూ యెలాగూలేదుగాని, తెలిశాక మౌనంగా వుండడం అసాధ్యం. ఈరోజే వెళ్లి చెప్పేసి వస్తాను' అని తీర్మానించుకుంది రాజమ్మ. కాని ఆమెకు లోలోన భయంగానే వుంది. ప్రశాంతంగా వున్న ఆ యింట్లో తనో పెద్ద తుఫాను రేపుతోంది. పర్యవసానమేమిటో? దెబ్బలాటలు, కీచులాటలు, మనస్పర్థలు అయితే పర్వాలేదుగాని—విడాకులు—ఆత్మహత్యలు...అబ్బా...

కాని తప్పదు—స్నేహితురాలి శ్రేయస్సుకోరి చెప్పక తప్పదు. అని అరగంటసేపు తర్కించుకుని తనకుతానే ధైర్యం చెప్పుకుంది.

* * *

ఆసాయంత్రం ఆఫీసునుండి తిరిగివచ్చాడు అప్పలరాజు...

విమలను మనస్సులో మననం చేసుకుంటూనే శ్రీమతితో కబుర్లు చెపుతూ కాఫీ త్రాగుతున్నాడు.

అంతలో రాజమ్మ వచ్చింది.

పీటలమీద కట్నంపేచీవస్తే ఆగిపోయిన పెళ్ళిలో పెళ్లికూతురులా వుందామె వాలకం. ఫస్టుక్లాస్ వస్తుందని ధీమాగా అనుకుంటూ పేపరు చూస్తే అసలు నెంబరేలేని విద్యార్థిని వదనంలా వుందామె ముఖారవిందం. ఆమె వాలకాన్నిబట్టి అప్పలరాజు జరిగింది వూహించాడు. స్నేహితురాలి సంసారంలో అశాంతి రేపి తద్వారా తనకూ మనశ్శాంతిలేక బాధపడుతోంది చెల్లెలు అనుకున్నాడు.

రాజమ్మకు కాఫీ తీసుకురావడానికి లోపలికెళ్లిందామె వదినగారు. రాజమ్మ అన్నయ్యదగ్గరకొచ్చి ఆయాసంగా కూర్చుంది.

'ఏమయింది చెల్లాయ్? నేనన్నట్లే జరిగిందా? చూశావా! అప్పుడేమో చెప్పకపోతే బాధన్నావు. ఇప్పుడు ఎందుకు చెప్పేనా అని బాధపడుతున్నావు. నీ సమస్య చిత్రమయింది సుమా...'

'ఉండన్నయ్యా...అసలు జరిగిందదికాదు. చెప్తానుండు' అని రెండు క్షణాలాగి కాఫీ చప్పరించింది. తరవాత చెప్పనారంభించింది—

'మా ఫ్రెండు నేను చెప్పిందంతా విని వొక్కమాటలో తేల్చేసిందన్నాయ్...' నాకిదంతా తెలుసు రాజూ, చాలాకాలం క్రిందటే తెలుసు' అంది. నేనాశ్చర్యంతో—'తెలిసే వూరుకున్నావా?' అనడిగేను. ఆమె నవ్వుతూ—

'ఆఁ తెలిసే వూరుకున్నాను. ఏంచెయ్యమంటావ్? నాదగ్గర ఆయన కోరే సుఖం లభించనప్పుడేంచేసేది? ఆయనకు నాకంటే ఆమెదగ్గరే యెక్కువ ఆనందంగా వుంది గనుక నే నన్నుకాదని ఆమెతో సంబంధం పెట్టుకున్నారు. నేను వారికి ఆనందాన్నివ్వడానికీ, వారిని సుఖపెట్టడానికే పెళ్ళిచేసుకున్నానుగాని, వారిని బాధించడానికి కాదుగా? వారి సౌఖ్యానికి, అడ్డుతగలడానికా నన్ను అర్థాంగిగా వారు స్వీకరించింది? వారి సంతోషమే నా సంతోషం' అని ఆమె అంటుంటే నాకెంతో కోపం వచ్చింది.

ఆమెకేం చదువులేదా, సంస్కారంలేదా, అందచందాల్లేవా? ఆస్తీ, అంతస్తూ లేవనా? మరీ మగవాళ్ళకేమిటో యీ జబ్బు. ఇంతటి విశాల హృదయము, త్యాగ గుణమూ వున్న భార్యవుండీగూడా ఆ దుర్మార్గుడు...హూఁ నేనయితేనా? నేనయితే...' ఆవేశంతో ఆమె చెప్పబోతుంటే—

'ఏంచేసావు నువ్వయితే?' అనడిగేడు అప్పలరాజు.

'రాజయితే ఏంచేస్తుందో తెలీదుగాని, నేనే అయితే—అంటే మీరే అలాచేస్తే—మీ యిద్దర్నీ ముక్కముక్కలుగా నరికేసి నేనూ పొడుచుకు చస్తాను. కట్టుకున్నదాన్ని సుఖపెట్టనివాడుంటేనేం, వూడితేనేం?' అప్పలరాజు భార్య మాటలు వింటూ అలాగే అంటుకుపోయాడు కుర్చీకి—ఆమెకూ యీమెకూ వున్న వ్యత్యాసాన్ని తలంచుకుంటూ.

'నిజంగా అన్నంతపనే చేస్తుంది నా సంగతేగాని దీనికి తెలిస్తే' స్వగతంగా అనుకున్నాడు అప్పలరాజు.

'నేనయితే ఏంజేస్తానో తెలుసా?...' అని రాజమ్మ యింకేమేమో చెప్తోందిగాని అప్పలరాజుకవేవీ వినిపించలేదు.